# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వైద్యరంగంలో నర్సులు అవిశ్రాంత సేవలు అందిస్తున్నారని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ కొనియాడారు.**

2. **రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.**

3. **రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

4. **ప్రతి జిల్లాలో ఒక దేవాదాయ శాఖ కార్యాలయం ప్రారంభిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.**

5. **ప్రముఖ వాగ్గేయకారులు, పద కవితా పితామహులు తాళ్ళపాక అన్నమాచార్య జయంతి ఈ రోజు.**

==========================

సమాజంలో వైద్య సేవలకు ప్రతి రూపంగా నిలుస్తున్న...., నర్సులు అందజేస్తున్న సేవలనుస్మరించు కుంటూ ఈ రోజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. వైద్య సేవలకు తన జీవితాన్నే అంకితంచేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. 1820 వ సంవత్సరం మే 12వ తేదీన ఇటలీలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ ..... 1854 సంవత్సరంలో సంభవించిన క్రిమియన్ యుద్ధంలో గాయపడిన సైనికులకు తన శక్తి మేరకు వైద్య సేవలు అందించారు. రాత్రి సమయాలలో కూడా గాయపడిన సైనికులకు దీపం సహాయంతో వైద్య సేవలు అందించారు. అందుకే .... ఆమెకు “లేడీ విత్ ల్యాంప్” అని పేరు వచ్చింది.

--------------------------

వైద్యరంగంలో నర్సులు అవిశ్రాంత సేవలు అందిస్తున్నారని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో ఆయన సమావేశం

అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.... ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో.. రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్‌లో నర్సులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ అహింతం శాంటాసింగ్ ప్రారంభించారు. ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి మంగళగిరి బస్టాండ్ కూడలి వరకు సాగిన ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. సీపీఆర్ పై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

---------------------------

రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాలో మంత్రి ఈరోజు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతాల్లో పునరుత్పాదక ఇంధనానికి పెద్దపీట వేశామని ఉద్ఘాటించారు.

---------------------------

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉద్యోగ మేళాను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐటీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

---------------------------

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మి షా తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ రోజు అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.స్వీయ జాగ్రత్తలతో పాటు అన్ని రకాల ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాల్లో జరిగే నష్టాన్ని తగ్గించవచ్చని ఎన్ టి ఆర్ జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకర్ రావు తెలిపారు. కలెక్టర్ లక్ష్మి షా మాట్లాడుతూ... విపత్తు నిర్వహణలో భాగంగా అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలి? అనే దానిపై అవగాహన కల్పించడం ముఖ్యమని తెలియజేస్తూ....

**..వాయిస్: 31 సెకన్లు....**

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని పలువురు ప్రముఖులు ఈరోజు దర్శించుకున్నారు. విఐపి విరామ సమయంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రలు వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు మంత్రులకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు

చేశారు. రంగనాయకుల మండపంలో శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేసి వేదఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి కొల్లు రవీంద్ర పాత్రికేయులతో మాట్లాడుతూ....

**..వాయిస్... 18 సెకన్లు....**

---------------------------

ప్రతి జిల్లాలో ఒక దేవాదాయ శాఖ కార్యాలయం ప్రారంభం చేయాలి అనేది ప్రభుత్వం నిర్ణయమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఒంగోలులో దేవాదాయ శాఖకి సంబంధించిన అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలో తిరుపతి జిల్లాలో రీజనల్ జాయింట్ కమీషనర్ కార్యాలయం, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 100 కోట్ల రూపాయలు ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ కోసం కేటాయించడం జరుగుతుందని వెల్లడించారు.

---------------------------

పద కవితా పితామహులు, తొలి తెలుగు వాగ్గేయకారులు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఈరోజు. 1408వ సంవత్సరం వైశాఖ పూర్ణిమ నాడు ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా తాళ్ళపాక గ్రామంలో జన్మించిన ఆయన... తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి, "అహోబిల" నారసింహస్వామి, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ... 32 వేలకుపైగా కీర్తనలు రచించారు. ఆయన రచనలు తరతరాలను అలరిస్తూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. 1503వ సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు.

---------------------------

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో మంత్రి నిన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా.. పలివెల గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... అంబేద్కర్ విదేశి విద్యా పథకం ద్వారా వెనుకబడిన వర్గాల విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్యను పొందేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించిందని మంత్రి వెల్లడిస్తూ....

**..వాయిస్: 26 సెకన్లు....**

---------------------------

ఏపీ-ఈఏపీసెట్-2025కు సంబంధించిన హాల్‌టికెట్లను ఈరోజు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ సెట్ ఛైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు కలిపి మొత్తం 3లక్షల 61వేల 299 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. పరీక్షలు ఈ నెల 19 నుంచి ప్రారంభంకానున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్ నం. 95523 00009 ద్వారా హాల్‌టికెట్లు పొందొచ్చని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం తెలుసుకునేలా హాల్‌టికెట్‌లో రూట్‌మ్యాప్ ఇచ్చినట్లు చెప్పారు. సందేహాలకు 0884-2359599, 2342499 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

=====================